

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**మళ్ళీ లలితానగర్** కాలనీకి వెళ్ళారు ఇద్దరూ. పంచాక్షరరావు ఎదురు చూస్తున్నాడు తాళం పెట్టి వున్న వాళ్ళింటి ముందు నిలబడి. దశరథరామయ్య ఇంకా రాలేదు.

"ఏమైంది?" అడిగాడు సాంబశివరావు.

"లేడు. ఒంటరిగా ఆ వయసువాళ్ళెవరూ విజయవాడ వెళ్ళలేదు. హాఫ్ టిక్కెట్ మాత్రమే ఎవరికీ అమ్మలేదట ఇవాళ."

"వాడికి రైలు తప్ప బస్సు విజయవాడకి వుందని తెలిసివుండదు. ఎందుకయినా మంచిదని పంపించాను" చెప్పాడు సాంబశివరావు.

"ఇప్పుడేం చేద్దాం?" అడిగాడు పంచాక్షరరావు.

"నాకేం పాలుపోవటంలేదు" నీరసంగా చెప్పాడు సాంబశివరావు.

నీరజ అప్పటికి తలుపు తాళం తెరిచి లోపలికి వెళ్ళడంతో, ఇద్దరూ ఇంట్లోకి వెళ్ళారు.

"ఐ యామ్ సో సారి. ఇదంతా సాహితివల్ల వచ్చింది" పంచాక్షరరావు బాధగా చెప్పాడు.

నీరజ మరోసారి చదివింది రాజేష్ వదిలి వెళ్ళిన నోట్. ఆ ఉదయం రాజేష్ తనతో మాట్లాడాలని ప్రయత్నించడం, తను నిర్లక్ష్యంగా వుండటం గుర్తుకు వచ్చింది. తనే కారణం.

కేవలం తనే కారణం, రాజేష్ మనసు గాయపడి వెళ్ళిపోవడానికి. తను "ఊఁ" అని వున్నా వెళ్ళిపోయేవాడు కాడేమో?

నీరజకి అంతదాకా క్రమక్రమంగా మనసులో పేరుకుంటున్న దుఃఖం ఒక్కసారిగా బయటకి వచ్చింది. నేలమీద కూర్చుని, మోకాళ్ళలో తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది. జ్వరంతో వున్న పిల్లాడు ఏమయ్యాడు అని తలుచుకున్న కొద్దీ పరిపరి విధాల పోతోంది ఆలోచన.

"ఏమిటిది? ఇప్పుడేమైందని వూరుకో" సాంబశివరావు లోపలికి వచ్చి నీరజ భుజం మీద చెయ్యివేసి అనునయించాడు. అతనికి మనసులో అలానే వుంది. మగాడు కాబట్టి ఏడవకుండా నిగ్రహించుకుంటున్నాడు.

"నావల్లనేనండీ వాడు వెళ్ళిపోయింది. వాడికేమైనా అయితే అందుకు బాధ్యురాల్ని నేనే. పలకరించినా మాట్లాడలేదు."

"స్టేజ్ మీద వాడు నా కొడుకు కాదని అంతమందిలో చెప్పా కాబట్టి బాధవేసి వెళ్ళిపోయాడు. నువ్వు కాదు కారణం. అనవసరంగా లేనిపోనివి ఆలోచించి మనసు పాడుచేసుకోకు."

"వెళ్ళండి. వెళ్ళి ఎక్కడున్నాడో వెదకండి" ఏడుస్తూ చెప్పింది నీరజ.

"అలాగే తలుపేసుకో."

"బయట తాళం పెట్టుకుని వెళ్ళండి. ఒంటరిగా వుంటే మరీ పిచ్చెక్కుతుంది నాకు. వాడి నిద్రమాత్ర ఒకటి వేసుకుని పడుకుంటాను. వాడు కనబడితేనే లేపండి."

సాంబశివరావుకి నీరజమీద జాలి కలిగింది. నీరజ తలమీద చేత్తో రాసి చెప్పాడు.

"వాడు ఎక్కడికీ వెళ్ళుండడు. తప్పక కనపడతాడు."

పంచాక్షరరావుతో చెప్పాడు సాంబశివరావు బయటకి వచ్చి ఇంటికి తాళం వేశాక.

"వెదకాలనే వుంది కాని ఎక్కడ వెదకాలో తోచడంలేదు. చూడాల్సిన ప్రదేశాలన్నీ చూసేసాను."

పోలీస్ స్టేషన్‌కి వెళదాం. మనం కూడా వుంటే బద్ధకం లేకుండా ఏదైనా ప్రయత్నం చేస్తారు."

"అయితే అక్కడికే వెళతాను నువ్వు పడుకో. రేపు బేంక్ కూడా వుంది. రేపు ఉదయంలోగా రాజేష్ కనపడకపోతే, నేను బేంక్‌కి రాను. మా సెక్షనులో ఆ సంగతి చెప్పు."

"నేను కూడా వుంటే నీకు కాస్త తోడుగా వుంటుందిగా."

"ఫర్వాలేదు. నాకు తోడు కావాలనుకుంటే నేనే మీ ఇంటికి వచ్చి నిన్ను నిద్రలేపుతాను."

"గుడ్ లక్."

సాంబశివరావు స్కూటర్ సందు మలుపు తిరిగేదాకా చూసి ఇంటికి వెళ్ళాడు పంచాక్షరరావు.

"దొరికాడా?" ఆసక్తిగా అడిగింది సాహితి.

"లేదు. వాడికేమైనా అవాలి, నీకు విడాకులిచ్చేస్తాను. ఆ తరువాత నీతో కాపురం చెయ్యలేను."

"మధ్యలో నేనేం చేసానని నా మీద విరుచుకుపడతారు? వాడిని పిలిచి యిలా చెయ్యమని నేనేం సలహా యివ్వలేదు. వాళ్ళింట్లో గొడవల వల్ల వాడు పారిపోయాడు."

పంచాక్షరరావు పక్కముందు గదిలోకి తెచ్చుకుని, దాన్ని అక్కడ పరచుకున్నాడు.

"ఇదేమిటి కొత్త వేషం?" అడిగింది సాహితి.

సమాధానంగా పంచాక్షరరావు ఆ గది తలుపు మూసుకుని లోపల గడియ పెట్టుకున్నాడు.

సాంబశివరావు పోలీస్ స్టేషన్‌లోకి వెళ్ళాడు.

"ఇంత త్వరగా తెలియదండి" చెప్పాడు డ్యూటీలో వున్న హెడ్ కానిస్టేబుల్ అతన్ని గుర్తుపట్టి.

ఎస్.ఐ దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"వాడికి వళ్ళు కాలిపోతోందండి. మందు ఇవ్వకపోతే ప్రమాదం. దయచేసి ఏదైనా ప్రయత్నం చేయండి. లేకపోతే చచ్చిపోతాడు."

సాంబశివరావు కళ్ళలోని నీళ్ళని చూసిన ఎస్.ఐ మనసులోనే విసుక్కుని టెలిఫోన్ రిసీవర్ అందుకున్నాడు.

"గాంధీ హాస్పిటల్ ఇవ్వండి" చెప్పాడు.

కొద్దిక్షణాల తర్వాత

"హలో అడిక్‌మెట్ ఎస్.ఐ హియర్. ఇవాళ ఏడేళ్ళ కుర్రాడెవరయినా అడ్మిట్ అయ్యాడా..?" సాంబశివరావు వంక చూసి అడిగాడు.

"పేరు?"

"రాజేష్" చెప్పాడు.

"అలాగే" రిసీవర్ పెట్టేసాడు.

ఓ కానిస్టేబుల్ మందు వాసన వేస్తున్న ఓ ఏభై ఏళ్ళాయిన కాలర్ పట్టుకుని లాక్కొచ్చాడు.

"కల్లు తాగి కాంపౌండ్ బయట గొడవ చేస్తున్నాడు సార్" చెప్పాడు.

"లేద్దొరా. ఈసారికి వదిలెయ్" చేతులతో మొక్కి చెప్పాడాయన.

"తోసెయ్" చెప్పాడు సబ్ఇన్స్పెక్టర్.

టెలిఫోన్ బెల్ మోగింది.

రిసీవర్ అందుకుని "హలో" అన్నాడు అవతలి వాళ్ళు చెప్పేది కాసేపు విని, డిస్కనెక్ట్ చేసాడు.

"ఉస్మానియా హాస్పిటల్లో ఎస్.ఐ.కి కలపండి" అడిగాడు. రిసీవర్ క్రెడిల్మీద వుంచాడు. ఓ నిమిషం తర్వాత బెల్ మోగితే మళ్ళీ రిసీవర్ అందుకుని ఫోన్లో ముందు అవతలివైపు వున్న ఎస్.ఐ.తో ఒకటి, రెండు వ్యక్తిగత విషయాలు మాట్లాడి చెప్పాడు.

"ఏడేళ్ళ కుర్రాడెవరయినా యివాళ అడ్మిట్ అయ్యాడా?" అవతలివైపునుంచి చెప్పింది విని ఫోన్ పెట్టేసాడు.

సాంబశివరావు ఆత్రంగా చూచాడు.

కానిస్టేబుల్ని పేరు పెట్టి పిలిచాడు. ఇందాక తాగిన ముసలివాడ్ని తెచ్చిన కానిస్టేబుల్ రాగానే చెప్పాడు.

"ఈ సాబ్ వెంట ఉస్మానియా హాస్పిటల్కి వెళ్ళు."

"అక్కడున్నాడా?" ఆత్రంగా అడిగాడు సాంబశివరావు స్కూటర్. తాళం చెవులతో లేచి నిలబడి.

"ఓ కుర్రాడు ఏక్సిడెంటులో అడ్మిట్ అయ్యాడు. వాడేనేమో వెళ్ళి చూడండి."

"ఏక్సిడెంటా?" గుండె గుభేలుమంది. "ఇప్పుడెలా వున్నాడు?" అడిగాడు సాంబశివరావు.

"మార్చురీలో వున్నాడు. ఐడెంటిఫై చెయ్యగలరేమో చూడండి"

"రా బాబూ."

క్షణం ఆలస్యం చెయ్యకుండా సాంబశివరావు బయటకి నడిచాడు. స్కూటర్ స్టార్టు చేసిన కొన్ని క్షణాలకి వచ్చాడు కానిస్టేబుల్. అతను ఎక్కీ ఎక్కగానే ముందు పోనిచ్చాడు బండిని.

సరిగ్గా ఇరవై నిమిషాల్లో ఉస్మానియా హాస్పిటల్లో, దడదడలాడే గుండెతో స్కూటర్ని ఆపాడు సాంబశివరావు.

"మీరిక్కడే వుండండి" అని ఆ కానిస్టేబుల్ ముందు ఉస్మానియా హాస్పిటల్లోని పోలీస్ అవుట్ పోస్ట్లోకి వెళ్ళివచ్చి చెప్పాడు.

"రండి"

సాంబశివరావు ఆ కానిస్టేబుల్ని అనుసరించాడు. తన పక్కన నీరజ లేనందుకు సంతోషించాడు. పంచాక్షరరావు వుండి వుంటే బావుండేది అనుకున్నాడు.

పొడుగాటి కారిడార్లో నడిచి, ఎదురుగా మార్చురీ అని రాసివున్న బోర్డ్ని చూసాడు.

"పోస్ట్మార్టం చేసారా?" అడిగాడు సాంబశివరావు వణికే కంఠంతో.

"అదయితే మార్చురీకి శవాన్ని పంపిస్తారు."

ఆ గదిలోకి నడిచారిద్దరూ. కానిస్టేబుల్ మార్చురీ అటెండెంట్‌తో ఏదో మాట్లాడాడు. అతను సాంబశివరావు వంక చూసి, టేబుల్ మీద వున్న రిజిష్టర్‌ని తిరగేసాడు.

"ఆ కుర్రాడికి.. ఆ కుర్రాడికి పొట్టమీద కట్టేమైనా వుందా?" అడిగాడు సాంబశివరావు.

"తెలీదండి, సాయంత్రం వచ్చింది డెడ్‌బాడీ. నేను ఇందాకే షిఫ్ట్‌లో వచ్చాను."

అతడు పొడుగాటి రెఫ్రిజరేటెడ్ డ్రాయర్స్ దగ్గరకి నడిచి, డ్రాయర్ నంబరు చూసి దాని ముందాగి చెప్పాడు సాంబశివరావుకి.

"ఇక్కడికి రండి."

ప్రాణాలు ఉగ్గబెట్టుకుని అతని పక్కకి నడిచాడు సాంబశివరావు. తన గుండె కొట్టుకునే చప్పుడు సాంబశివరావుకి స్పష్టంగా వినిపిస్తోంది. ఆగకుండా వందమైళ్ళు పరిగెత్తుకొచ్చినవాడిలా రొప్పుతున్నాడు.

అతను డ్రాయర్‌ని బయటకి లాగి చెప్పాడు.

"చూడండి."

సాంబశివరావుకి తన గుండె పేలిపోతుందేమోననిపించింది. బలాన్ని కూడదీసుకుని తలెత్తి చూసాడు. కుడికాలి బొటనవేలికి రబ్బర్ బేండ్‌తో పెట్టివుందో టేప్ పాదాల దగ్గర ఆపేశాడు చూపు.

"మా అబ్బాయి కాళ్ళు ఇంత నల్లగా ఉండవు."

తల పక్కకి తిప్పి చెప్పాడు.

కానిస్టేబుల్, అటెండెంట్ చిన్నగా నవ్వారు.

"పోస్టుమార్టం అయ్యాక అందరి శరీరాలు నల్లగానే వుంటాయి. శవం చెడిపోకుండా వుండటానికి చర్మం మీద రాసే నల్లమందు వల్ల కూడా నల్లబడుతుంది ప్రతీ శవం. ముఖం చూడండి."

సాంబశివరావు రెండుసార్లు తలతిప్పాడు కాని చూడలేక భయంతో కళ్ళు మూసుకున్నాడు.

"ఫర్వాలేదు. చూడండి" చెప్పాడు కానిస్టేబుల్ ధైర్యం చెపుతున్నట్లుగా.

సాంబశివరావు కళ్ళు విప్పి మంచులా గడ్డకట్టివున్న చిన్నపిల్లవాడి శవాన్ని చూశాడు.

ఫెరాక్ డీ హైడ్ అనే రసాయనిక పదార్థంతో నల్లబడ్డ ఆ శవం రాజేష్‌ది కాదు.

వెంటనే ఆ గదిలోంచి బయటకి వచ్చేసాడు సాంబశివరావు. గత అరగంటనించి పేరుకున్న టెన్షన్ ఒక్కసారిగా చేత్తో తీసేసినట్లుగాపోయింది.

పోలీస్ కానిస్టేబుల్‌ని స్టేషన్‌లో దింపాడు. ఎస్.ఐ స్టేషన్‌లో లేడు. ఇంటికి వెళ్ళిపోయాడు.

నీరజ నిద్రమాత్ర ప్రభావం వల్ల హాయిగా నిద్రపోతోంది.

దశరథరామయ్యకి దాదాపు పిచ్చెక్కినట్లుగా వుంది. రాజేష్ అలా యింట్లోంచి వెళ్ళిపోతాడని ఆయన కల్లోకూడా అనుకోలేదు. రాజేష్‌కి ఏదో అయిందని ఆయన మనసు కీడు శంకిస్తోంది.

రాజేష్‌తో ఆయనకున్న అనుబంధం ఎక్కువ. గత కొన్ని వారాలుగా ఆయన రాజేష్‌తో కొన్ని వందల గంటలు ఎంతో కులాసాగా గడపడంతో, రాజేష్ మీద అందరికన్నా ఎక్కువ ప్రేమ వుండటంతో, ఆయనకి బాధ అధికంగా వుంది.

హైదరాబాద్ రోడ్లన్నీ తిరగసాగాడు ఎక్కడయినా రాజేష్ కనబడతాడేమోనని. ఫలానా ప్రదేశంలో వెదకాలి అన్న ఆలోచన కూడా ఆయనకి రావడంలేదు. మెదడంతా మొద్దుబారినట్లుగా వుంది.

రాజేష్‌కి ఏం కాకపోతే, మళ్ళీ సలక్షణంగా తన కంటపడితే తిరుపతికి వెళ్ళి, కొండ ఎక్కి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటానని మనసులో పదే పదే మొక్కుకోసాగాడు.

ఆయన టైమెంతయిందో చూసుకోలేదు. టేంక్‌బండ్ పక్కనున్న పార్క్‌లో కూర్చున్నాడు. అది ఆయన వచ్చిన అయిదో పార్క్. ఏ పార్క్‌లోనో బెంచీమీద పడుకుని నిద్రపోతున్నాడేమోనని కనబడిన పార్క్‌లన్నీ కలియతిరుగుతున్నాడు.

అలా ఎంతసేపు కూర్చున్నాడో తెలియదు. దూరంగా అరుపులు వినపడి అటువేపు చూసాడు. గుంపులోని వాళ్ళు గోలగా మాట్లాడుకుంటున్నారు.

"ఏమైంది?" అడిగాడు లేచి వాళ్ళ దగ్గరకి వెళ్ళి.

"ఎవరో కుర్రాడు నీళ్ళలో పడ్డాడు" చెప్పాడు ఒకతను.

"ఎన్నేళ్ళు?" వణికే కంఠంతో అడిగాడు.

"పదేళ్ళలోపు. బయటకి తీశారు."

దశరథరామయ్య గుండె ఝల్లుమంది. గుంపులోని వాళ్ళని నెట్టుకుంటూ గబగబా లోపలికి వెళ్ళాడు.

నేలమీద పడుకుని వున్నాడా కుర్రాడు. నిక్కరు, షర్టు, ఆయన ఆత్రంగా ఆ కుర్రాడి మొహం చూసాడు.

రాజేష్ కాకపోవడంతో ఆయన మనసు కొద్దిగా తేలికపడింది. ఆంగ్లో యిండియన్ కుర్రాడు. ఎవరో పొట్టమీద నొక్కుతుంటే ఆ కుర్రాడి నోట్లోంచి నీళ్ళొస్తున్నాయి. ప్రథమ చికిత్స చేస్తున్నారు.

దశరథరామయ్య అక్కడ ఇక వుండలేక పార్క్‌లోంచి బయటకి నడిచాడు. ఇంటివేపు నడవసాగాడు. ఆయన వున్న మానసిక స్థితిలో కాళ్ళ నొప్పులు కూడా తెలియడంలేదు.

హఠాత్తుగా ఆగిపోయాడు లలితానగర్ దగ్గర పడగానే. కొద్ది దూరంలో నడుస్తున్న ఓ కుర్రాడు ఆయన కంటపడ్డాడు. చేతిలో సామానులేదు.

ఆయనకి ఆనందంతో గుండె లయ తప్పినట్లుగా అయింది. గబగబా ఆ కుర్రాడివేపు పరిగెత్తుతూ అరిచాడు.

"రాజేష్ ఆగు."

ఆ కుర్రాడు ఆగలేదు. దశరథరామయ్య పరుగు వేగం పెంచాడు.

"ఆగు. నిన్నే."

ఆ కుర్రాడు అకస్మాత్తుగా నడుస్తున్నవాడల్లా పరిగెత్తసాగాడు.

"ఆగు నిన్నే."

దశరథరామయ్య శక్తినంతా కూడగట్టుకుని వగరుస్తూ పరిగెత్తసాగాడు, ఇంకా వేగం పెంచి.

పరిగెత్తుతున్న ఆ కుర్రాడి భుజం పట్టుకుని ఆపాడు.

"వదులు, నన్నొదులు" గింజుకున్నాడా కుర్రాడు.

రాజేష్ కాదు. అదేరంగు నిక్కరు, అదేరంగు చొక్కా, అదేరకం క్రాఫ్, అదే వంటిరంగు కాని రాజేష్ కాదు.

దశరథరామయ్య ఆ కుర్రాడిని వదిలేసాడు బెదిరిపోయిన ఆ కుర్రాడు పరిగెత్తుకుంటూ ఓ యింట్లోకి వెళ్ళిపోయాడు.

తను యింటికి చేరుకునేసరికి రాజేష్ వచ్చి వుండవచ్చనే మిణుకు మిణుకుమనే ఆశతో యింటిదారి పట్టాడు దశరథరామయ్య.

మరో రెండురోజులు గడిచాయి. సాంబశివరావు ఉదయం, సాయంత్రం పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి వస్తున్నాడు. ఇదివరలో విజయవాడ ఎడిషన్‌లో ఓ పేపర్‌లో ప్రచురింపబడ్డ రాజేష్ ఫోటోని పోలీస్ స్టేషన్‌లో యిచ్చాడు.

పేపర్‌లో ప్రకటన యిచ్చాడు రాజేష్ ఫోటోతోపాటు.

"బాబూ రాజేష్! నీ మీద యింట్లో ఎవరికీ కోపం లేదు. మీ పిన్నికి జ్వరం. నిన్ను చూడాలనుకుంటోంది. ఇది చూడగానే వెంటనే యింటికిరా మీ అమ్మ ఎక్కడుందోకూడా తెలిసింది.

ఆ రోజు సాయంకాలం హైదరాబాద్ రేడియో స్టేషన్‌నుంచి అనౌన్సర్ "కనబడుటలేదు" శీర్షిక కింద రాజేష్ వివరాలు, సాంబశివరావు ఇంటి చిరునామా ప్రకటించింది.

అదే రోజు రాత్రి హైదరాబాద్ టి.విలో రాజేష్ ఫోటోని చూపించి వివరాలు చెప్పింది అనౌన్సర్. రాజేష్‌కి సంబంధించిన వివరాలు తెలిసిన వాళ్ళు సాంబశివరావుకి తెలియపరచవలసిందిగా కోరింది.

బేంక్‌కి సాంబశివరావుకి వచ్చిన టెలిగ్రాంని తెచ్చిచ్చాడు పంచాక్షరరావు.

అది బెంగుళూర్‌లోని సావిత్రినించి. తను రాజేష్ కోసం ఎదురు చూస్తున్నానని, వెంటనే రాజేష్‌ని తీసుకురమ్మని. ఇంటికి కూడా అలాంటి టెలిగ్రాం ఒకటి వచ్చింది.

"ఏం చేద్దాం?" అడిగాడు సాంబశివరావు నీరజని.

"తెలీదు" చెప్పింది నీరజ నిస్పృహతో.

26

"ది గ్రేట్ ఇండియన్ సర్కస్" వాచ్‌మెన్ అలవాటు పకారం అర్ధరాత్రి సింహాల బోను తలుపులకున్న తాళాలని తనిఖీ చేయడానికి వెళ్ళాడు.

అతని దృష్టి గుర్రాల పక్కన గడ్డిమోపుమీద పడుకుని వున్న ఏడేళ్ళ రాజేష్ మీద పడింది. ఆ కుర్రాడి దగ్గరకి వెళ్ళి చేత్తో తడుతూ లేపాడు వాచ్‌మెన్.

అతని చేతికి వెచ్చగా తగిలింది. ఆ కుర్రాడి ఒళ్ళు కాలిపోతోంది. వెంటనే రాజేష్‌ని ఎత్తుకుని గబగబా డాక్టర్ జోసెఫ్ టెంట్ వైపు నడిచాడు వాచ్‌మెన్.

జోసెఫ్ వయసు ఏభకి దాటుతోంది. గత ఇరవై రెండేళ్ళుగా ఆయన "ది గ్రేట్ ఇండియన్ సర్కస్" కంపెనీలో డాక్టర్‌గా వుంటూ, ఆ కంపెనీతో వూరూరా తిరుగుతున్నాడు. కంపెనీ ఉద్యోగులు ఎవరికయినా ఆరోగ్యం బాగోలేకపోతే అతనే చికిత్స చేస్తాడు.

"గుర్రాల దగ్గర పడున్నాడు" చెప్పాడు వాచ్‌మెన్.

జోసెఫ్ రాజేష్‌ని ముట్టుకుని చూశాడు. టెంపరేచర్ చూసి ఓ ఇంజక్షన్ యిచ్చాడు. రాజేష్ పొట్టమీద వున్న మాసిపోయి వాసన వేస్తున్న కట్టుమీద పడింది ఆయన దృష్టి. ఆ కట్టు విప్పి బొడ్డు కింద వున్న గాయాన్ని పరీక్షగా చూశాడు. డెట్టాల్‌తో శుభ్రం కొత్త కట్టు కట్టాడు.

ఈలోగా వాచ్‌మెన్ తన యజమాని నంబియార్‌ని పిలుచుకు వచ్చాడు.

"ఎవరు?" అడిగాడు నంబియార్ గుప్పు గుప్పున పైప్‌లోంచి పొగవదులుతూ.

సర్కస్ కంపెనీ ఉద్యోగస్థులంతా తెలిసి వచ్చి రాజేష్‌ని చూసి వెళుతున్నారు. అరగంట తరువాత కళ్ళు తెరిచాడు రాజేష్.

"ఎవరు బాబూ? నీ పేరేమిటి?" అడిగాడు డాక్టర్ జోసెఫ్.

రాజేష్ తనెక్కడున్నాడో గమనించి లేచి కూర్చున్నాడు.

"ఎవరబ్బాయివి? ఇక్కడెందుకొచ్చావ్?" అడిగాడు నంబియార్ వచ్చీరాని తెలుగులో.

"నేను మీ సర్కస్‌లో బఫూన్‌గా చేరతాను" చెప్పాడు రాజేష్ ఇంగ్లీషులో.

"నీకు ఆపరేషన్ అయిందా?" అడిగాడు జోసెఫ్.

తల వూపాడు రాజేష్.

"ఎక్కడ?"

"హైద్రాబాద్‌లో."

"హైదరాబాద్ నించి వస్తున్నావా?" అడిగాడు నంబియార్ ఆశ్చర్యంగా.

"అవును. హైదరాబాద్‌లో మీ సర్కస్ చూశాను. నాకు బఫూన్‌గా చేరాలనిపించింది."

"మీ ఇంట్లో చెప్పి వచ్చావా మరి?"

"లేదు?"

"ఏం?"

"నాకెవరూ లేరు" దిగులుగా చెప్పాడు రాజేష్ కాసేపాగి.

"నీ పేరు?

"రాజేష్"

"అమ్మా, నాన్నా లేరా నీకు?"

"అమ్మ వుంది. కానీ ఎక్కడుందో తెలీదు. నాన్నలేడు."

"ఇంతకాలం ఎక్కడున్నావు?"

"ముందర అమ్మ దగ్గర విజయవాడలో. మా నాన్న దగ్గరకి పంపించింది హైదరాబాద్‌కి. నాన్నేమో నేను ఆయన కొడుకు కానే కాదన్నారు. అమ్మ దగ్గరకి వెళదామంటే ఎక్కడుందో తెలియదు. ఏం చేయాలో తోచక ఈ ఊళ్ళో మీ సర్కస్ ఆడుతోందని తెలిసి యిక్కడికి వచ్చేశాను. మరి నాకు బఫూన్ వేషం యిస్తారా?"

"పడుకో. రేపు మాట్లాడదాం" చెప్పాడు నంబియార్. ఆయనకి చిన్నపిల్లలు సర్కస్‌లో చేరదామని ఇంట్లో చెప్పకుండా రావడం అనుభవమే. మర్నాడు రాజేష్ తండ్రికి కబురు చేయాలనుకున్నాడు. ఉదయం రాజేష్‌ని తన టెంట్‌కి పిలిపించాడు.

"నువ్వు చిన్న పిల్లవాడివి, నీకు బఫూన్ ఉద్యోగం ఇవ్వాలంటే మీ నాన్నగారి అనుమతి కావాలి. ఆయన పేరు, ఎక్కడ పనిచేస్తున్నారో చెపితే ఆలోచిస్తాను."

రాజేష్ తల అడ్డంగా వూపి చెప్పాడు.

"నాకు తెలీదు."

"పోనీ విజయవాడలో మీ అమ్మ ఎడ్రస్ చెప్పు."

మళ్ళీ తల అడ్డంగా వూపి చెప్పాడు నవ్వుతూ.

"నాకు తెలీదు."

ఆ నవ్వు 'నే చెప్తానా?' అన్నట్టు వుంది.

ఎన్ని విధాల ప్రయత్నం చేసినా రాజేష్ ఎవరి చిరునామా యివ్వలేదు. తనకి బఫూన్ వేషం వేయాలని వుందని, ఆ సర్కస్ కంపెనీలో వాళ్ళతో వుండిపోతానని చెప్పాడు.

"ఏం చేద్దాం?" అడిగాడు నంబియార్ జోసెఫ్‌ని.

"ఈ కుర్రాడి వివరాలు తెలుసుకోవాలంటే ఎవరినయినా వీడి ఫోటోతో హైదరాబాద్ పంపిస్తే చాలు. ఈ కుర్రాడికి ఇటీవలే మేజర్ సర్జరీ అయింది. హైదరాబాద్ హాస్పిటల్స్‌లో ఎంక్వయిరీ చేస్తే రాజేష్‌కి ఆపరేషన్ చేసిన డాక్టర్‌ని కనుక్కోగలం. ఆ తరువాత వివరాలు తేలిగ్గా తెలుస్తాయి."

"మన తర్వాతి కేంప్ వరంగల్‌కి పర్మిషన్ కోసం ఎలాగో వేలాయుధం రేపు హైదరాబాద్ వెళుతున్నాడు. ఈ పనీ అప్పగిస్తే సరి." చెప్పాడు నంబియార్.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in